# తాత

సుబ్బయ్యతాత కఱ్ఱపోటు వేసుకుంటూ మధ్యగది లోంచి వంటగదిలోకి నడిచాడు. కోడలు మహాలక్ష్మి పొయ్యి లోకి కట్టెలు ఎగసనతోసి విసురుతోంది.

కఱ్ఱపోటు విని వెనక్కి తిరిగి "అబ్బాయి వసారాలో ఆడుకుంటూన్నాడా" అంటూ ప్రశ్నించింది మహాలక్ష్మి. ఆ కంఠంలో అణకువ, భయం భక్తీ, బదులు వినవచ్చే పురమాయింపు ధోరణి సుబ్బయ్యతాతని కనీసం రోజుకు పాతికసార్లయినా గతించిన కాలాన్ని నెమరుకు తెస్తూంటుంది. సుబ్బయ్యతాత యింకా యిటువంటి పట్టింపులు వదులుకోలా. పైగా మరింతగా బలపడుతున్నాయి కూడా. అది ఈ యింటి గడప తొక్కిననాటి మనిషేనా? కాదు. మారిపోయింది. తను యింట్లో ఉన్నంతసేపూ కుక్కినపేనులా జాడయినా తెలియకుండా అంత ఒద్దికతో మసులుకునేది. 'అబ్బాయి!' అని తను పిలిస్తే 'మామగారు పిలుస్తున్నారు' అని భర్తకి హెచ్చరిక చేసే మహాలక్ష్మి, ఆ హెచ్చరికలో ఎంతో భయం, వినయం

ఒలకబోసిన మహాలక్ష్మి వెనకనిలబడిపిలిచినా ఒక్కొక్కప్పుడు వినిపించుకోదు యిప్పుడు. ఏదో ఆలోచిస్తూంటుంది యెప్పుడూను; మహా ఈ దేశభారం తానే భరిస్తున్నట్టు.

"మిమ్మల్నేనండీ, అబ్బాయ్ వసారాలోవున్నాడా?" మహాలక్ష్మి కంఠం ఈమారు కొద్ది ఆతృతగానే ధ్వనించింది.

సుబ్బయ్యతాతకు రావల్సిన కోపం రానే వచ్చింది. 'ఏమో నాకు తెలియదు' మొండిగా జవాబిచ్చాడు. కోడలు ముఖంలోకి చూసీ చూడనట్టుగా చూసి తన జవాబు బాగా పనిచేసిందని తలపోసి తృప్తిగా ముందుకు అడుగు వేశాడు. తా నాశించినట్టు యీ సమాధానం ఒక విధంగా తన తప్పు తాను తెలుసుకునేట్టు చేస్తుందనుకున్న సుబ్బయ్యతాత రెండడుగులు వేశాడో లేదో వెనకనించి మహాలక్ష్మి పకపకా నవ్వటం వినిపించింది. విన్న మరుక్షణం రివ్వున వెనక్కుతిరిగి "ఎందుకు నవ్వుతావ్?" అన్నాడు అభిమానం దెబ్బతిన్న స్వరంతో.

మహాలక్ష్మి మరింతగా నవ్వు శృతి హెచ్చించింది.

"బొత్తిగా భయం, భక్తీ లేకపోతేసరి. నవ్వు... నవ్వు!..." అంటూ పెద్ద పెద్ద అంగలువేస్తూ పెరటిలోకి వెళ్ళబోయాడు సుబ్బయ్యతాత.

మహాలక్ష్మి నవ్వు ఆపి "మావగారు రానురాను మరీ పసివారయిపోతున్నారు" అంది మావగారికి వినబడేట్లుగా.

సుబ్బయ్యతాత చర్రున వెనక్కుతిరిగి "అనవే! నీ యిష్టం వచ్చినట్టు అను. బొత్తిగా భయం, భక్తీ పోయిందిలే.

అసలు వాడ్ని అనాలి" అన్నాడు చేతిలో కర్ర గుమ్మంమీద టక్కు టక్కు మని కొడుతూను.

"మాట్లాడితే భయం భక్తీ అంటారుగదా, నాలో బరితెగించిన లక్షణాలు మీ రేం చూశారు చెబుదురూ?" అంది మహాలక్ష్మి లేని కర్కశాన్ని కంఠంలో తెచ్చిపెట్టుకుని. వడ్లు దంచేవాళ్ళూ, పడవ లాగేవాళ్ళూ ఆ పని చేస్తున్నంతసేపూ ఏదో కూనిరాగాలుతీస్తూనే వుంటారు; పని చురుగ్గా సాగటానికో, మానసికమైన విశ్రాంతికోసమో. అలాగే మహాలక్ష్మికూడా మావగారితో నిత్యం వాదులాడుతూనే వుంటుంది పనిపాటలు చేసుకుంటూనే. "మావగారి ధర్మమా అని యివాళ పనిచేసినట్టే అనిపించలేదు" అంటూంటుంది భర్తతో.

"ఏం చూడాలి? అలా పురమాయింపు ధోరణిలో మాట్లాడవద్దని నీకు ఎన్నిసార్లు చెప్పలేదు. నువ్వు నా మాట వింటున్నావా? కలవారి బిడ్డవు అయితే అయావు కాని కాస ఒద్దిక నేర్చుకో" అన్నాడు సుబ్బయ్యతాత ఒక చేత్తో గుమ్మం కమ్మీపట్టుకుని ఒక చెయ్యి గాలిలో వూపుతూను.

"మాట్లాడితే నావాళ్ళఊసు ఎత్తకండి. నా కటువంటి లేనిపోని గర్వాలు లేవు."

"నా అంతరం ఏమిటి; నీ అంతరం ఏమిటి? నన్ను నువ్వు పురమాయింపులూ, గద్దింపులూ చేస్తావా?" అంటూ రొప్పుతూ గుమ్మంలోనే చతికిలబడ్డాడు సుబ్బయ్యతాత.

మధ్యగదిలో గడియారం పదిగంటలుకొట్టింది. వీధిలో జన సందడిలో పెరుగువాడి కేకలు కలిసిపోయాయి. వాడు అరిచి అరిచి ఏకంగా యింట్లోకే వచ్చేశాడు.

"అదేమిటి గొల్లా, మరీ యింట్లోకే వచ్చేశావు" అంది మహాలక్ష్మి.

"అరిచి అరిచి గొంతారిపోతే, వినిపించుకోకపోతే యింకేం చేసేదంట" అన్నాడు వాడు.

"మాటల గొడవలో ఉండిపోయానులే. అయినా అంత చొరవగా చొరబడకు మరి. నీ మంచికోసమే చెబుతున్నా. ఏ వస్తువయినా పోయిందనుకో, చప్పున నిన్నే అనుమానిస్తాం"_ మహాలక్ష్మి యిలా మాట్లాడుతుంటే గొల్ల నోరు ఆవులించేశాడు.

"అంతే తల్లీ. కలికాలం, పెరుగు పొయ్యకండా పోతినా మీకే యిబ్బంది అవుతాదని చొరవచేశాను" అంటూ గొల్ల వెళ్ళిపోయాడు.

మహాలక్ష్మి పెరుగుగిన్నె అలమారాలో పెట్టి తలుపులు మూయబోయింది.

"దానిమీద మూత పెట్టఖ్ఖర్లేదు?" అన్నాడు సుబ్బయ్యతాత యేదో విధంగా తప్పు పట్టాలనే ధోరణిలో.

"ఎందుకులెండి, ఫర్వాలేదు."

"ఫర్వాలేదేమిటి నీ ముఖం! ఏదయినా పడి చస్తే?"

"ఇంతలో ఏమీ పడదులెండి."

"ఇంతసేపు వాదించకపోతే చెప్పినపని వెంటనేచెయ్య రాదూ? అది మంచివాళ్ళ లక్షణం."

"చెయ్యక పోవడం చెడ్డవాళ్ళలక్షణం అంటారు... అంతేనా ?"

"అంతేగాక."

"పోనిలెండి! 'చెడ్డవాడనిపించుకోవాలని' కోరిగ్గా వుంది అంటూంటారు మీ అబ్బాయి. అలాగే నాకూ చెడ్డదాన్నని పించుకోవాలని కోరిగ్గావుంది."

"ఇప్పుడు మహా మంచి దానవైనట్టు."

"మీ ఒక్కరిదృష్టిలో మంచిదాన్ని కాకపోతే లోకం దృష్టిలోకూడా అంతే అనుకున్నారేమిటి? అంతా మీలాగే వుండరు."

"అయితే నే నిప్పుడు నిన్ను కష్టపెడుతున్నా నంటావు ?"

"నే నలా అనలేను. అన్నీ మీరే అనుకుంటు న్నారు."

సుబ్బయ్యతాతకి యెక్కడలేని పౌరుషం పుట్టు కొచ్చింది. 'తను చెప్పినపని చెయ్యకపోవడం అలాగుంచి యింతసేపు ఎదురు వాదిస్తుందా!' చప్పునలేచి అలమారు తలుపు తీశాడు.

కాని పెరుగు గిన్నెమీద మూత పెట్టేవుంది. మహా లక్ష్మి పకపకా నవ్వేసింది.

సుబ్బయ్యతాత అగ్గి రుద్రుడయిపోయాడు. "నీ కంత

ఎగతాళిగా వుందన్నమాట" అన్నాడు యేదో నిర్ణయానికి వచ్చినట్టుగా.

కోడలు నవ్వుతూనే వుంది.

"నే నీ యింట్లో ఒక్కక్షణం వుండేదిలేదు; ఏ కాశీకో, రామేశ్వరానికో పోతాను" అంటూ సుబ్బయ్యతాత చర చరా తన బట్టలపెట్టె వున్న గదిలోకి వెళ్ళిపోయాడు.

మహాలక్ష్మి పూజకి పూలకోసం పెరట్లోకి నడిచింది.

*  *  *

బట్టలు సద్దుకుంటున్న సుబ్బయ్యతాత దగ్గరకి మన వడు ఏడుస్తూ కళ్లు నలుపుకుంటూ వచ్చాడు.

చేసూ చేస్తూన్న పనిమానేసి "ఎందుకు నాన్నా ఏడుస్తున్నావ్? చెప్పు! చెప్పుమరి...అమ్మ కొట్టిందా?" అంటూ మనవడ్ని దగ్గరికి తీసుకుని బుజ్జగించాడు సుబ్బయ్యతాత.

"ఉహు! అమ్మ కొట్టలా" అన్నాడు మనవడు ఏడుస్తూనే.

"మరెవరు కొట్టారు? నాతో చెప్పు. వాళ్ళని ముక్కు పిండేసాను. వీపు చీరేస్తాను, డొక్క చించేసాను. ఏడవకు మరి! ఎవరు కొట్టారుచెప్పు. పనిమనిషి మాలచ్చికొట్టిందా?"

"ఉహు!"

"మరెవరో చెప్పు."

"మరేం..."

"ఆఁ ఏవిటో చెప్పు! ఏడవకుండా చెప్పాలి మరి."

"మరేఁ, పక్కింటి రాముడు..."

"ఆఁ! రాముడు ఏం చేశాడు ?"

"నా కొయ్యగుర్రం లాక్కున్నాడు."

"హారి భడవా! నీ గుర్రంలాక్కున్నాడా. ఉండు వాని పని పడతా. తెచ్చిస్తాలే. ఏడవకు" అంటూ సుబ్బయ్యతాత వాడ్ని వెంటబెట్టుకుని వీధిలోకి నడిచాడు.

పెరట్లోంచి వస్తూ "మీతో పాటు వాడుకూడా దేనికి కాశీకి" అంటూ ఎత్తిపొడిచింది మహాలక్ష్మి.

సుబ్బయ్యతాత "ఊఁ!" అంటూ కోడలివైపు రూక్షంగా చూసి బుసకొట్టాడు.

పక్కింటి వాళ్ళబ్బాయి రాముడు అరుగుమీద కూర్చుని కొయ్య గుర్రంతో ఆడుకుంటున్నాడు.

"అదిగో తాత! నా గుర్రం! అదే" ఆరేళ్ళ మనవడు సుబ్బయ్యతాత చెయ్యిపుచ్చుకుని ముందుకులాగాడు. ఈ గొంతువిని రాముడు గుర్రాన్ని సంకలో యిరికించుకుని లోపలికి పారిపోయాడు.

సుబ్బయ్యతాత లోపలికి చొరబడి "రత్తమ్మతల్లీ, రత్తమ్మతల్లీ" అంటూ పిలిచాడు. రత్తమ్మ లోపల్నించే "ఎవరూ?" అంది.

"నేనే సుబ్బయ్యని. చూడు నీ మనవడు యేం చేశాడో?"

"ఏం చేశాడు?" అంటూ ఆమె యివతలకి వచ్చింది తడి చెయ్యి తుడుచుకుంటూను.

"నిన్న బజారునించి అబ్బాయి కొనుక్కొచ్చాడు

అయిదణాలు పెట్టి. పిల్లాడు ఆడుకుంటుంటే మీవాడు వచ్చి లాక్కుపోయాట్ట. ఇదేమైనా బాగుందా ?”

“ఇంతకీ ఏమిటది ?”

“కొయ్య గుఱ్ఱం ?”

“ఒరేయ్ రాముడూ ! ఇలారా...” మనవణ్ణి పిలిచింది రత్తమ్మ. వాడు బెక్కుతూ బెక్కుతూ వచ్చి దూరంగా గుమ్మందగ్గర నిలబడిపోయాడు.

“ఏంరా ! వాళ్ళబ్బాయి గుఱ్ఱం ఎత్తుకొచ్చావా ?” అని అరిచింది రత్తమ్మ.

రాముడు మాట్లాడకుండా లోపలికి వెళ్ళి గూట్లో దాచిన గుఱ్ఱం తెచ్చి సుబ్బయ్య తాత మనవడికి ఇచ్చేశాడు.

“వెధవ లేకి గుణాలు ! ఎంతచేసినా యింతే వెధవ ముఖాలకి. దేబిరికొట్టు వెధవ” అంటూ రత్తమ్మ మనవడి చెవి మెలిపెట్టి నెత్తిన ఓ మొట్టికాయ మొట్టి లోపలికి వెళ్ళిపోయింది. వాడు ఏడుపు లంకించుకున్నాడు.

మనవడు సుబ్బయ్యతాతవైపు ఓ మారూ, రాముడు వైపు ఓ మారూ జాలిగా చూశాడు.

“ఏరా, నీ గుఱ్ఱం లాక్కున్నందుకు వాడికి మంచి శాస్తి అయింది కదూ” అన్నాడు సుబ్బయ్యతాత మనవణ్ణి దగ్గరగా తీసుకుని.

"పాపం ఏడుస్తున్నాడు తాతా !" అన్నాడు మనవడు ముఖం బాధగాపెట్టి.

సుబ్బయ్యతాత ఎందుకో తగని సిగ్గు పడిపోయాడు. అయిదేళ్ళ మనవడు తనకంటె పెద్దయినట్టుగా తాను అల్పత్వం ఫీలయ్యాడు.

మనవడి చెయ్యి పుచ్చుకుని తను వాడ్ని నడిపిస్తున్నాడా; లేక మనవడే తన్ని చెయ్యి పట్టుకుని నడిపిస్తున్నాడా?

ఆ సాయంత్రమే బజారుకు వెళ్ళి మరో గుర్రం కొని రాముడు చేతిలో పెట్టినప్పుడు ఆ సమస్య మనసులోంచి చెరిగిపోయింది.

"ఇకనించీ నిన్ను నేను 'తాతా' అని పిలుస్తారా" అన్నాడు సుబ్బయ్యతాత మనవడ్ని ఒడిలో కూచోబెట్టుకుని.

"అదేమిటి ?" అంది మహాలక్ష్మి.

"అది అంతేలే. నీకు తెలవదు. వాడ్ని అలాగే పిలుస్తాను" అన్నాడు సుబ్బయ్యతాత మనవడి తల నిమురుతూను.

"అవునుగాని, నిన్న మీరు చేసిన పనేమిటి ?" అంది మహాలక్ష్మి.

"ఏం చేశాను?" అన్నాడు సుబ్బయ్యతాత అయోమయంగా చూస్తూను.

"ఠ తమ్మగా రింటిమీదికి యుద్ధానికి వెళ్ళారుటగా మనవడ్ని తీసుకుని !"

నిజానికి అలా చేసినందుకు తనూ పశ్చాత్తాపపడ్డాడు. దాని పర్యవసానం, ఈదురుగాలిలో బొంటిమీద తుండు కప్పుకుని బజారువెళ్ళి మరో గుర్రం కొని రాముకు యివ్వటం

జరిగింది. మళ్ళీ ఈ సమస్య కోడలు తిరగతోడేసరికి అభి మానం అడ్డువచ్చింది సుబ్బయ్యతాతకు.

"అప్పుడు వెళ్ళాను" అన్నాడు సుబ్బయ్యతాత.

"కుర్రాడు కాబట్టి ఏదో లాక్కున్నా డనుకోండి. చప్పున పెద్దవాళ్ళం జోక్యం చేసుకుంటే ఏం బావుంటుంది!"

"ఇంతకీ ఏమయిందో చెబుదూ?" అన్నాడు సుబ్బయ్య తాత విసుగ్గా.

"ఆవిడ మనసు కష్టపెట్టుకుంది"

సుబ్బయ్యతాత మనవడ్ని గుండెలకి హత్తుకుని తల నిమిరాడు — కోడలు ప్రశ్నలకు తను జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నట్టుగా.

మహాలక్ష్మి వంటగదిలోకి వెళ్ళిపోగానే సుబ్బయ్య తాత మనవడ్ని తీసుకుని వీధి వసారాలోకి వెళ్ళి కూచు న్నాడు.

"తాతా ! బుర్రు బుర్రుమంటూ వెళ్తుందే, దాన్నే మంటారు ?"

"అదా, మోటారు కారురా" అన్నాడు సుబ్బయ్య తాత.

"మరి దానికి లాగటానికి గుర్రం లేదేం ?"

"అది గుర్రబ్బండీ కాదురా, మోటారుకారు. లోపల కూచున్నాడు చూడు, వాడు నడుపుతాడు దాన్ని."

"అదా" అంటూ దీర్ఘం తీశాడు మనవడు అంతా అర్థం అయిపోయినట్టుగా.

"ఆఁ! అది" అన్నాడు సుబ్బయ్యతాత తృప్తిగా.

"ఏం సుబ్బయ్యతాతా ! కులాసా ?" అంటూ పలకరించాడు దారినపోయే జోగయ్య.

"ఆఁ ! భగవంతుడి దయవల్ల"

"మనవడ్ని పెట్టుకుని కూర్చున్నావా తీరిగ్గా...ఏరా గుంటడా ! బాగా చదువుకుంటున్నావా ?" అన్నాడు జోగయ్య, దగ్గరగావచ్చి సుబ్బయ్యతాత పక్కని కూచుంటూను.

మనవడు తాత ముఖంలోకి చూశాడు.

సుబ్బయ్యతాతా, జోగయ్యా లోకాభిరామాయణంలో పడిపోయారు. మనవడు దూరంగా ఆడుకుంటున్నాడు.

"అబ్బాయికి పిల్లలా ?" అన్నాడు సుబ్బయ్యతాత.

"అబ్బే ! ఆపాటి అదృష్టం వుంటే యికనేం. విచారమే లేదనుక్కో" అన్నాడు జోగయ్య.

"అబ్బే, తొందరపడతావేం. నాలుగురోజులు ఆగు" అన్నాడు సుబ్బయ్య.

"తొందరగాక ! నీకంటె నాలుగు నెలలు పెద్దకదూ నేను. నీ కప్పుడే ఆ రేళ్ళ మనవడుండె !"

సుబ్బయ్యతాత గర్వంగా నవ్వుకున్నాడు.

జోగయ్య చుట్టూ చూసి రహస్యంగా "అసలు నా కొడుక్కీ, కోడలుకూ పొత్తు ఏడుస్తేనా. ప్రతిరోజూ కోడిపుంజుల్లా దెబ్బలాడుకుంటారు. నే నున్నాననే భయమైనా లేదు వాళ్ళకి. అసలు నామాటంటేనే లక్ష్యంలేదు"అన్నాడు.

సుబ్బయ్యతాత నవ్వి "చిన్నవాళ్ళు కదూ, అందరూ అంతే" అంటూ సర్ది చెప్పాడు.

ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకుని జోగయ్య సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. జోగయ్యా, సుబ్బయ్యతాతా చిన్న ప్పుడు ఆరోతరగతివరకూ ఒకేబడిలో కలిసి మెలిసి చదువు కున్నారు. ఉద్యోగ ధర్మాలమీద దేశదేశాలూ తిరిగినా చివరికి పుట్టిన మట్టిమీదకే చేరుకున్నారు. పిల్లలు చేతికందిన తర్వాత విశ్రాంతి తీసుకుంటున్నారు. కాదు, తీసుకుంటు న్నాం అనుకుంటున్నారు. అంతే! ఈ భూమ్మీద నూక లున్నంతకాలం మనసుకి విశ్రాంతి అంటూ వుండదు.

"అబ్బాయ్, అబ్బాయ్!" అంటూ మహాలక్ష్మి లోపల్నించి కేకపెట్టింది.

మనవడు లోపలికి వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చి "తాతా, అమ్మ అన్నం పెట్టింది. రమ్మంటూంది" అని చెప్పాడు.

అన్నం ఉడగ్గానే ముందుగా భోజనం చేసేది సుబ్బయ్యతాత! ఆ తర్వాతనే అందరూను. అది మహాలక్ష్మి ఏర్పాటుచేసిన పద్ధతి.

ఇవాళ తాతా మనవడూ కలిసే భోజనం చేశారు. మహాలక్ష్మి కొడుక్కి దగ్గరవుండి అన్నం కలిపిపెడుతూ మధ్య మధ్య కిందపడిన మెతుకుల్ని తీసి కంచంలో వెయ్యటం కొడుకు గమనిస్తూనే వున్నాడు. వాడు గమనించిన ఆశ్చర్య కరమైన విషయం ఏమిటంటే; అమ్మ తన కంచం చుట్టూతా వున్న మెతుకులే కాకుండా తాతయ్య కంచం చుట్టూతా పడ్డ మెతుకులుకూడా అలాగే ఏరి తాతయ్య కంచంలో వెయ్యటం. తాతయ్యా తనూ ఒకటే నన్నమాట. నవ్వుతూ వాడు తాతయ్య ముఖంలోకి చూశాడు.

సుబ్బయ్యతాతకూడా వాడి ముఖంలోకి చూసి నవ్వు కున్నాడు.

"తాతా ! మరి నాన్న ఊర్నించి ఎప్పుడొస్తాడు ?" అని అడిగాడు మనవడు.

"రాత్రికి వస్తాడు" అని తాతయ్య జవాబు చెప్పాడు.

"మరి నాకు ఆడుకుందు కేదయినా తెచ్చిపెడతాడా?"

"తెస్తాడు"

"ఏమో మరి"

"నువ్వు వాగుడుమాని అన్నం తింటావా, నాలుగు వాయించనా" అని కసురుకుంది మహాలక్ష్మి.

"తింటాడు లేవే. వాడ్నలా కసుర్కోకు."

"మీ కేం, మీరు చెబుతారు. అవతల చచ్చే చాకిరీ వుంది" అంది మహాలక్ష్మి.

భోజనాలయాయి. మధ్యగదిలో మంచంమీద పడు కుని మనవడిచేత కాళ్ళు పట్టించుకుంటూనే నిద్రకి జారు కున్నాడు సుబ్బయ్యతాత. తాతయ్య పడుక్కోగానే పక్కనే తనూ నడుం వాల్చాడు మనవడు.

* * *

ప్రతిరోజూ మనవడి చదువు తన సమక్షంలోనే జరగా లంటాడు సుబ్బయ్యతాత. అక్షరాభ్యాసం చేసి ఏడాదయినా వాడ్ని బడికి పంపటం అతనికి యిష్టంలేదు. తండ్రి మాటలకు ఎదురాట్టం యిష్టంలేక, కొడుకు ప్రయివేటు యింటిదగ్గరే చెప్పిస్తున్నాడు. సాయంత్రం ఐదు గంటలకి వస్తానని మేస్టరు చెబుతే సుబ్బయ్యతాత వల్లకాదన్నాడు. "అది ఆడుకునే సమ

యం. రెండింటికే రావటం మంచిది” అన్నాడు. అలాగేనని మాస్టారు అలాగే కొన్నాళ్ళు చెప్పాడు. నెల్లాళ్ళయిందో లేదో సుబ్బయ్యతాత ఆ పద్ధతికూడా మార్చేశాడు. “రెండింటికి పిల్లాడు నిద్రపోయే సమయం. కాబట్టి మూడు నాలుగు గంటలమధ్య రండి” అన్నాడు. ఆ మాస్టారు ఒచ్చే పది రూపాయలూ వదులుకోవటం యిష్టంలేక అందుకూ ఒప్పుకున్నాడు.

“మీ ధోరణి చూస్తే అబ్బాయి చదువుకోవటం యిష్టంలేనట్టుందే” అంది మహాలక్ష్మి. ఆనాడు ఇంట్లో చిన్న యుద్ధం జరిగింది. అప్పట్నించి ఆ ప్రస్తావన వస్తే తను ఎడంగా వుండిపోతుంది మహాలక్ష్మి.

గడియారం మూడుగంటలు కొట్టింది. సుబ్బయ్య తాత కళ్ళు నులుపుకుంటూ లేచేసరికి వీధి వరండాలోనుంచి “రాముడు మంచిపిల్లవాడు. పెందలకడనే లేచును. ముఖము కడుగుకొనును. ఒడలు శుద్ధి స్నానము చేయును” అని చదువుతున్నాడు మనవడు. మధ్య మధ్య మాస్టారి గొంతుకూడా వినిపిస్తూంది. సుబ్బయ్యతాత గబగబా లేచి వరండాలోకి వెళ్ళి మాస్టారు పక్కని కూచున్నాడు.

మాస్టారు నమస్కారం చేశారు. సుబ్బయ్యతాత ప్రతి నమస్కారం చేశాడు. పైకి నమస్కారంచేసినా మాస్టారుకి తను యిలా వచ్చి కూర్చోవటం యిష్టంలేదని సుబ్బయ్య తాతకి తెలుసు, అందుకనే పట్టుదలగా తనూ రావటం.

‘ఎప్పుడు సంపద గలిగిన—పద్యం అప్పచెప్పరా’ అన్నారు మాస్టారు.

తన మనవడికి ఆ పద్యం రాలేదన్న సంగతి సుబ్బయ్య తాత తెలుసుకున్నాడు. వాడు భయంగా, జాలిగా మాస్టారు వైపు చూట్టం సుబ్బయ్యతాత భరించలేకపోయాడు.

"పోనీలేరా, రేపటికి చదువు" అన్నాడు సుబ్బయ్య తాత. మాస్టారు సాధారణంగా యితర పిల్లల విషయంలో అయినట్టయితే ఇటువంటప్పుడు మహా కఠినమైన చర్యలు తీసుకుంటాడు. కాని యిప్పుడలా నిజస్వరూపం బయటపెట్టటానికి పెద్దపులిలా సుబ్బయ్యతాత ఎదురుగా కూచున్నాడాయె. తన పరిస్థితి మహా ఇరకాటంలో పడిపోయింది.

అక్కడికీ తను లోకువ కాకూడదని "ఎందుకు చదువలేదురా ?" అన్నారు మాస్టారు కొంత తీవ్రంగానే.

వాడు తాతయ్యవైపు చూస్తూ వుండిపోయాడు.

"నిన్నే ! ఎందుకు చదవలేదు ?" మరింత కఠినంగా అడిగారు మాస్టారు.

సుబ్బయ్యతాత భరించలేకపోయాడు. "పోనీలెండి మాస్టారూ, రాలేదని తెలిసిం తర్వాత దండించటం మంచిది కాదు. కుర్రకుంక; భయపడిపోతాడు" అన్నాడు.

"మీరలా అంటే ఇక నేను చదువు చెప్పటం సాధ్యపడదండీ. ఇవ్వాళ్టికి పదిరోజుల్నించీ చెబుతున్నా. ఆ పద్యం యింకా రాలేదంటే భయం లేకపోవటమే కారణం. పంతులుగారంటే భయం లేకపోతే వాళ్ళకి చదువెలా వస్తుందండి! ప్రతిరోజూ మీ దన్ను చూసుకునే వాడిలా మొండికేస్తున్నాడు" అన్నారు ధైర్యంచేసి.

మహాలక్ష్మి ఇదంతా వింటూనేవుంది.

"ఇప్పుడు ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళు ఏలాలా? నెమ్మదిగా అదే వస్తుంది లెద్దురూ" అన్నాడు సుబ్బయ్య తాత.

"మొక్కలో వంగనిది మానయి వంగుతుందా పంతులుగారూ" అన్నాడు మాస్టారు.

"ఏమిటో అంటారు మీరు. వీధిలో పటాలు అమ్ముకుని బ్రతికినవాళ్ళూ, కూలిపని చేసుకుని బ్రతికినవాళ్ళూ పెద్ద వాళ్ళయి రాజులూ, చక్రవర్తులూ అయి దేశాలు ఏలిన వాళ్ళున్నారు. ఎంత చదివినా ఆఫీసులో గుమాస్తా పనేగా! నాకు తెలియందేమీ లేదు. అసలు ప్రపంచంలో బ్రతకడానికి ఒంట్లో కండా, బుర్రలో తెలివీ ఉండాలయ్యా" అంటూ చిన్న ఉపన్యాసం ఇచ్చాడు సుబ్బయ్యతాత.

"పదమూడు రూపాయల, తొమ్మిదణాల, తొమ్మిది పైసల్లోంచి ఎనిమిది రూపాయల, పదకొండణాల, తొమ్మిది పైసలు తీసేస్తే ఎంత మిగులుతుందిరా?" అని మరో ప్రశ్న వేశారు మాస్టారు.

మనవడు ఆయన చెప్పిన అంకెలు పలకమీద రాసుకుని ఆలోచించసాగాడు. కొద్దిసేపు వేళ్ళు లెఖ్ఖపెట్టాడు. ఎంత ఆలోచించినా వాడి బుర్రకు ఎంత మిగులుతుందో తేల లేదు. చేతికొచ్చిన అంకెలు ఏవో ఉజ్జాయింపుగా కింద వేశాడు.

మాస్టారు అగ్గిరుద్రుడయిపోయి అలవాటుగా కుడి చెయ్యి విసురుగా పైకెత్తాడు. దెబ్బ పడుతుందని తోచగానే సుబ్బయ్యతాత మనవడ్ని అమాంతం ఎత్తుకొని లోపలికి తీసుకు పోయాడు.

మాస్టరుగారు ఈ అవమానం భరించలేక పోయాడు. లేచి లోపలికి వచ్చి మొదట్నించీ అంతా గమనిస్తూన్న మహాలక్ష్మితో "రేపట్నించి మానుకుంటున్నానండీ" అన్నాడు.

మహాలక్ష్మి ఏమీ మాట్లాడలేక పోయింది. "అవును నేనంతా గమనిస్తూనే ఉన్నాను. మీరేమీ అనుకోకండి. పెద్దవారాయన. ఎలాగూ వాడ్ని ఒచ్చే నెలనుంచీ బడికి పంపించాలనుకుంటున్నాం. అక్కడ్నించి అలాగే మీ ఇంటికి వచ్చి చదువుకుంటాడు" అంది క్షణం పోయిం తర్వాత.

మాస్టారు తన ధోరణిలో "పది రోజుల్నించీ చెబుతున్నానండీ ఆ పద్యం. ఇవ్వాల్టికి రాలేదంటే ఆశ్చర్యంగా వుంది. కుర్రవాడు తెలివి తక్కువవాడు కాదు. మరి ఇటీవలే ఇలా మొండికేస్తున్నాడు. ఆమాత్రం తీసివేత లెఖ్ఖ చెయ్య లేకపోయాడు. మా అమ్మాయి నాలుగుసార్లు చదివితే పద్యాలు అప్పచెబుతూంటుంది" అన్నాడు.

"నిజమే మీరు చెప్పినట్టుగా తాతగారి అండ చూసుకుని వాడలా అశ్రద్ధ చేస్తున్నాడు" అంది మహాలక్ష్మి.

"ఆయన వచ్చి ముందు కూచుంటే అబ్బాయి చదువు సాగటం కష్టమండీ."

"నే కనుక్కుంటాను లెండి."

మహాలక్ష్మి నెమ్మదిగా గదిలోకి తొంగిచూసింది. సుబ్బయ్యతాత పేకముక్కలతో మేడ కడుతున్నాడు. మనవడు నవ్వుతూ పొంగి పోతున్నాడు.

మహాలక్ష్మి వెర్రెత్తిపోయింది. చరచరా వెళ్ళి కొడుకుని రెక్కపుచ్చుకుని దబదబా నాలుగు బాదింది. సుబ్బయ్యతాత క్షణం నివ్వెరపోయి తెప్పరిల్లి అడ్డుపడినా మహాలక్ష్మి మరో దెబ్బ వెయ్యనే వేసింది.

"నీకేం అమ్మవారు పూనారటే. అలా బాదుకుంటావు పసివాడ్ని" అన్నాడు సుబ్బయ్యతాత మనవడ్ని గుండెలకి హత్తుకుంటూను.

"మీ మూలాన్నే వాడిలా అడ్డగాడిదలా తయారవుతున్నాడు. చదువూలేదు, సంధ్యాలేదు ఎంతసేపూ ఆటలూ పాటలూ తప్పించి. చదువుకుంటేనే ముద్దూ ముచ్చటాను. చదువుకోకపోతే ఏముంది?"

"నా మూలాన్న వాడు చెడిపోతున్నా డంటావు" అన్నాడు సుబ్బయ్య తాత.

"అవును మరి. మీరు చేస్తున్న పనేమిటి చెప్పండి. పంతులుగారి దగ్గర వాడు చదువుకుంటూంటే మీ రెందుకు అక్కడికి వెళ్ళాలి; వెళ్ళి వాడ్ని వెనకేసుకుని ఆయనంటే భయంలేకుండా చేస్తే ఇక వాడికి చదువు అబ్బుతుందా?"

సుబ్బయ్యతాతకి ఈ కోడలు మహాలక్ష్మి తనమీద ఏదో ప్రత్యేకంగా కక్ష కట్టినట్టుగా అనిపించింది. "నావల్లనే మీరంతా కష్టపడుతున్నారని నువ్వు సూటిగా అనకపోయినా

నీ మనసులో ఉద్దేశం అదేనని నాకు తెలుసు" అన్నాడు సుబ్బయ్యతాత.

"మొగుడ్ని కొట్టి..." అని మహాలక్ష్మి అంటుండగానే అకంతరంగా అడ్డంవచ్చి "నువ్వసలు నా ముందు నించి పో" అన్నాడు సుబ్బయ్యతాత.

"ఏం? నా ముఖం చూస్తే అంత అసహ్యంవేస్తూందా?" అంది మహాలక్ష్మి.

"నీ ముఖం కాదు _ నా ముఖం చూసేనే నీకు అసహ్యం వేస్తుంది. అందుకనే పొమ్మన్నాను" అన్నాడు సుబ్బయ్యతాత.

మహాలక్ష్మి కొడుకుని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. సుబ్బయ్యతాత మెల్లగా లేచాడు. కర్రపోటు వేసుకుంటూ ఒంటిమీద తుండు కప్పుకొని చెప్పులు తొడుక్కుని గుమ్మం దిగబోతున్నాడు. మహాలక్ష్మి చెప్పుల చప్పుడూ, కర్ర టకటకా విని ఇవతలికి వచ్చింది. "అదేమిటి ఇప్పుడు బయల్దేరారు ?" అంది ఆశ్చర్యంగా.

"అవును. బయల్దేరాను" అన్నాడు తాతయ్య క్లుప్తసరిగా.

"ఎక్కడికి?...ఎందుకు ?"

"భద్రం వాళ్ళని చూట్టానికి పోతున్నాను. రాత్రికి రాను."

"అదేవిటండీ, ఇప్పుడంత తొందరేం వచ్చింది? పొద్దున్నే వెళుదురుగాని, రండి" అంది మహాలక్ష్మి.

"కాదు ఇప్పుడే వెళ్ళాలి. రాత్రికి అక్కడే పడుకుంటాను. బుద్ధిపుడితే రెండుమూడు రోజులు అక్కడే ఉండా లనుకుంటున్నా. ఎన్నాళ్ళనుంచో భద్రం రమ్మంటున్నాడు."

"రేపు వెళ్ళొచ్చులెండి. ఈదురుగాలిలో మంచిది కాదు. వెచ్చగా భోజనంచేసి అబ్బాయితో ఆడుకుందురు గాని. మీరు కనక లేకపోతే వాడు నిమిషం ఉండలేడు."

"నావల్లనే వాడు చెడిపోతున్నాడని ఇప్పుడేగా నువ్వన్నది!" అన్నాడు సుబ్బయ్యతాత.

"ఏదో పొరబాటున అన్నానులెండి. తప్పు నాదే. పొద్దున్నే భోజనంచేసి మనవడ్ని తీసుకుని పోదురుగాని, రాత్రి అక్కడ భోజనంచేసి వచ్చేద్దురుగాని, రండి లోపలికి" అంది మహాలక్ష్మి.

ససేమిరా వెళ్ళితీరా లన్నాడు సుబ్బయ్యతాత. మహలక్ష్మి అనేక విధాల ప్రాధేయపడింది. ఆఖరికి "పోనీ వెళ్తే వెళ్ళారు. పొద్దున్నే ఒచ్చేయండి. మూడురోజులు దేనికి అక్కడ ఉండటం — అలవాటుందా చెప్పండి" అంది.

"మూడు రోజులు పోయింతర్వాతగాని రాదల్చుకో లేదు. అక్కడ్నించే అలా కాశీ, రామేశ్వరం పోతాను."

"అలాగే వెళ్దురుగాని. రాత్రికి మీఅబ్బాయి వస్తారుగా నేచెప్పి మిమ్మల్ని యాత్రకు పంపే పూచీ నాది."

"అలా వీల్లేదు. ఇప్పుడు నేను భద్రంగారింటికి వెళ్ళి తీరాల్సిందే."

మహాలక్ష్మి ఎన్ని విధాల నచ్చచెప్పినా సుబ్బయ్య

తాత వినదల్చుకోలేదు. చివరికి చేసేదిలేక మహాలక్ష్మికూడా ఏమీ అనలేకపోయింది.

భర్త వచ్చి అడుగుతే ఏమని చెబుతుంది! ఆయన అపోహ పడతారేమో. అయినా ఎన్నడూ ఎవరిగుమ్మం ఎక్కని మనిషి ఇలా రెండుమూడు రోజులు పరాయివాళ్ళ ఇంట్లో ఉంటే వాళ్ళేమనుకుంటారు? ఇంట్లో కోడల్నయిన తన్నిగురించి వాళ్ళు చెడుగా భావించే అవకాశం లేదూ." ఇలా సాగిపోయాయి మహాలక్ష్మి ఊహలు. ఈ మాటల్లోంచి ఆమె తెప్పరిల్లి చూసేసరికి సుబ్బయ్యతాత సందు మలుపు తిరుగుతున్నాడు.

* * *

రాగానే భర్త "నాన్న ఏడీ" అని అడిగాడు.

మహాలక్ష్మి జంకుతూనే చెప్పింది. "భద్రంగారింటికి వెళ్ళారు" అని.

"ఎందుకు ?"

"ఆయన కనిపించినప్పుడల్లా రమ్మని పిలుస్తున్నారుట. సాయంత్రం వెళ్ళారు."

బాబిగాడు చప్పున "మరే! అమ్మ ఎంత వద్దని చెప్పినా వినకుండా వెళ్ళిపోయాడు. తాతయ్యకి కోపం వచ్చింది" అనేశాడు.

మహాలక్ష్మి అక్కడ నిలబడకుండా ఏదోపని కల్పించుకుని వంటగదిలోకి వెళ్ళిపోయింది.

మళ్ళీ ఈ ప్రస్తావన భోజనాలదగ్గర కొనసాగింది,

బాబిగాడే ఈ ప్రసక్తి తెచ్చాడు. మహాలక్ష్మి నిజం చెప్పె య్యటం మంచిదనే ఉద్దేశంతో "ఏమీ లేదండి, మావగారికి నామీద కోపం వచ్చింది" అంది.

"ఎందుకని ?" – భర్త ప్రశ్నించాడు.

మహాలక్ష్మి నవ్వుతూ "ఎందుకేమిటంటే ఏంచెప్పను. పెద్దవారు. ఆయన్ని నేను తప్పు పట్టకూడదు. పెద్దవాళ్ళూ, పసివాళ్ళూ సమానం అంటారు" అంది.

భార్య ఎటువంటి మనిషో, మావగారిమీద ఆమెకున్న అభిమానం ఎటువంటిదో ఎరగని మనిషికాడు కాబట్టి "బహు చిన్నచిన్న విషయాలకికూడా వాళ్ళు అమిత పట్టుదల పెంచు కుంటారు. చిన్నపిల్లల తంతు" అన్నాడు భర్త.

"చెప్పటానికి సిగ్గుగాఉంది, చాలా స్వల్ప విషయాలు సుమండీ. ఈమాత్రం చిన్నచిన్న సంగతులే ఆయనంతగా పట్టించుకుంటారు...అయినా చాలావరకూ తప్పు నాదేలెండి" అన్నది మహాలక్ష్మి.

భర్త చిన్నగా నవ్వుతూ భార్య ముఖంలోకి చూశాడు. "నాకు ఆయనతో వాదించటం అంటే సరదా. అందుకని ఏదో ఒకటి కవ్విస్తూంటాను. అదాయన అపార్థం చేసుకుంటారు" అంది మహాలక్ష్మి.

భర్త కొంచెం పెద్దగానే నవ్వేశాడు.

రాత్రి ఆరుబయట పక్కలు వేసుకున్నారు. కొడుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని కబుర్లు చెబుతున్న భర్తదగ్గరకు వచ్చి "పోనీ మీరువెళ్ళి ఆయన్ను తీసుకు రాకూడదూ ?" అంది మహాలక్ష్మి.

"ఎందుకు? పర్వా లేదు. పొద్దున్నే వెళ్ళి తీసుకవస్తాను" అన్నాడతను.

"ఇప్పుడెందుకు వెళ్ళకూడదు?"

"'ఇంట్లో తగాదాలాడి ఇలా వచ్చాడుకాబోలు ముసలాయన' అని వాళ్ళు అనుకుంటారు నేను కనక వెళ్తే."

మొత్తానికి అసంతృప్తిగానే ఏదో తప్పు చేసినదానికి మల్లే బాధపడిపోయింది మహాలక్ష్మి.

*  *  *

ఇంకా బాగా చీకటి ఉండగానే మహాలక్ష్మి మెలుకువ వచ్చి చూస్తే పక్కన బాబిగాడు కనిపించలేదు. ఆమె కంగారుగా భర్తని లేపింది. ఇద్దరూ వెతుకులాట ప్రారంభించారు.

"ఇలారండి. చప్పున రావాలి" మహాలక్ష్మి వల్లమాలిన సంతోషాతిశయంతో భర్తను పిలిచింది.

"అటు చూడండి!"

వేపచెట్టుకు కొద్ది దూరంలో వేపచెట్టు నీడా, వెన్నెలా సమభాగంగా పంచుకున్న నులకమంచంమీద మనవడ్ని దగ్గరగా హత్తుకుని ఒక చెయ్యి ఆప్యాయంగా వాడిమీద వేసి గుబ్బుపెడిచి నిద్రపోతున్న సుబ్బయ్యతాతని చూసి భార్యాభర్తలిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని మనసులో వెలితి పూడిపోయినట్టుగా నోటికి చేతులు అడ్డంపెట్టుకొని నవ్వుకున్నారు.

—'హంస' మాసపత్రిక నుండి